క్లుప్తంగా

ఖబరస్థాన్ స్థలాన్ని పరిరక్షించాలి

కందుకూరు: మండలంలోని బైరాగిగూడ మైనార్టీలకు చెందిన ఖబరిస్తాన్‌ను హెచ్ఎండీఏ అధికారులు వెంచర్ వేస్తూ కబ్జా చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన మైనార్టీ నాయకుడు ఎండీ దావూద్ వాపోయారు. గురువారం పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి అధికారులతో ఖబరిస్తాన్‌ను వదలి వెంచర్ పనులు చేసుకోవాలని కోరారు. వంద సంవత్సరాలుగా అక్కడ సమాధులు ఉన్నాయని పరిశీలించి న్యాయం చేయాలన్నారు. గతంలో పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు అందించామన్నారు. కాగా మా రికార్డుల ప్రకారం మేము ముందుకు వెళ్తున్నామని, ఏదైనా ఉంటే ఫిర్యాదు చేయాలని అక్కడి అధికారులు అతనికి సూచించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



దావుత్‌ఖాన్‌గూడలో దీక్షలు చేస్తున్న దళితులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని దావుత్‌ఖాన్‌గూడలోని సర్వే నంబర్–2లో మా భూమి మాకు కావాలని చేపడుతున్న రిలే దీక్షలు గురువారంతో 26వ రోజుకు చేరుకున్నాయి. ఏళ్ల తరబడి కబ్జాలో ఉండి దున్నుకొని బతుకుతున్న దళిత కుటుంబాలకు ఇచ్చేలా అధికారులు, మంత్రులు చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు పట్టుకొని నిరసన దీక్షలు చేశారు. 40 ఎకరాలు ఉన్న ఈ భూమిలో ఇప్పటికే ప్రభుత్వ సంక్షేమ భవనాలు వేలిశాయని మిగిలి ఉన్న భూమిని సాగులో ఉన్న దళిత కుటుంబాలకు ఇవ్వాలని కోరారు. ఈ దీక్షల్లో శ్రీనివాస్, చిత్రం శ్రీను, రమేష్, ఉమాకాంత్, జ్ఞానేశ్వర్, రాజ్‌కుమార్, జ్యోతి, లక్ష్మమ్మ, అండాలు, విజయ, రాజ్‌కుమార్, నాగభూషణం, రాములు, తదితరులున్నారు.

బీసీబంధు చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న జనార్దన్

పహాడీషరీఫ్: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల జనార్దన్ అన్నారు. బీసీ బంధు చెక్కులను జల్‌పల్లి గ్రామానికి చెందిన మల్లేష్, మౌనికలకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, దళిత, మైనార్టీ బంధులతో ఆయా వర్గాల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మంత్రి సబితారెడ్డి ఆదేశాలతో అధికారులు నిజమైన పేదలను బీసీ బంధులో ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు సయీద్ పటేల్, పోలెమోని నగేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం

తుర్కయంజాల్: దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య తెలిపారు. గురువారం పురపాలక సంఘం, కమ్మగూడ 22వ వార్డు ఇందిరమ్మ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మకాలనీ అధ్యక్షుడు హనుమంత్‌గౌడ్, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడు రాజునాయక్, శంకర్, గోవింద్, కృష్ణ, శివ పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



బోనంతో ప్రదక్షిణ చేస్తున్న భక్తురాలు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లిలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లను చేసినట్లు కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఉత్సవాల్లో కౌన్సిలర్ కొంగ్రు మల్లేష్, బ్యాంకు డైరెక్టర్ కొంగ్రు స్వప్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ తహసీల్దార్‌గా షేక్ ముంతాజ్

కడ్తాల్: కడ్తాల్ నూతన తహసీల్దార్‌గా షేక్ ముంతాజ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అన్వర్ బదిలీపై ఇబ్రహీంపట్నం మండలానికి వెళ్లగా, ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ ఎస్టేట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న క్ ముంతాజ్ కడ్తాల్ మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ షేక్ ముంతాజ్ మాట్లాడుతూ.. మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

బస్సు సౌకర్యం లేక అవస్థలు

ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక చాలా గ్రామాల్లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, కాలినడకనే విద్యా సంస్థలకు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా సంబంధిత అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నోసార్లు వినతులు, ధర్నాలు చేసినా ప్రయోజనం శూన్యం. ఇది కందుకూరు మండల పరిధిలోని విద్యార్థుల దుస్థితి.

- ప్రమాదకరంగా ఆటోల్లో విద్యార్థుల ప్రయాణం
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



స్కూల్‌కు ఆటోలో వచ్చిన విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) ప్రమాదకరంగా ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

కందుకూరు: మండలంలోని ముచ్చర్ల, ఊట్లపల్లి, సాయిరెడ్డిగూడలకు కరోనా తర్వాత ఆర్టీసీ బస్సులు బందయ్యాయి. దీంతో ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. నేదునూరు మోడల్ స్కూల్‌లో సీటు వచ్చి చదువుతున్న విద్యార్థులు నిత్యం ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థులు కాలినడకన శ్రీశైలం రహదారి వరకు చేరుకుని అక్కడి నుంచి ఇతర వాహనాల్లో వెళ్లి వస్తున్నారు. దీంతో ప్రతినిత్యం వారు నరకయాతన అనుభవిస్తున్నారు. దెబ్బడగూడలో గత 8 రోజులుగా బస్సు సర్వీసును నిలిపివేశారు. అక్కడి గ్రామస్తులు ధర్నాలు, వినతి పత్రాలు అందించినా పట్టించుకునే నాథుడే లేరు. కందుకూరు చౌరస్తా నుంచి హైదరాబాద్‌కు వెళ్లే విద్యార్థులకు పల్లె వెలుగు లేక మెట్రో సర్వీసులో అదనంగా చెల్లించి ప్రయాణించాల్సి వస్తుంది. తిరుగు ప్రయాణంలో సైతం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య పల్లె వెలుగు బస్సులు నడపడం లేదు. ఆ సమయంలో మెట్రో బస్సులనే నడుపుతున్నారని, 6 నుంచి 7 గంటల సమయంలో పల్లె వెలుగు బస్సులు నడిపిస్తున్నారని, దీంతో ఇబ్బందిగా మారిందని విద్యార్థులు వాపోతున్నారు. ఉ. 8, 9 గంటలకు సా. 4, 5 గంటల సమయాల్లో పల్లె వెలుగు బస్సులు నడపాలని కోరుతున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి యాచారం మీదుగా కందుకూరు వరకు, గూడూరు, రాచులూరు మీదుగా ఇబ్రహీంపట్నం రూట్‌లో బస్సులు నడపడంలేదు. హైదరాబాద్ నుంచి తిమ్మాపూర్‌కు గతంలో మిథాని డిపో బస్సు నడిచేది ప్రస్తుతం నిలిపివేశారు. గుమ్మడవెల్లి, బేగంపేట రూట్‌లో ఉ. 9.30 గంటల సమయంలో నడిచే బస్సు కొన్నిసార్లు వస్తుంది. ఒక్కోసారి రావడం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురళీనగర్, చిప్పలపల్లి, పులిమామిడి, బాచుపల్లి మీదుగా నేదునూరు మోడల్ స్కూల్ వరకు వచ్చే బస్సు సర్వీసు కిక్కిరిసి ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదనంగా మరో సర్వీసును వేయాలని కోరుతున్నారు.

“బస్సు సౌకర్యం కల్పించాలి



అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి. ఉదయం, సాయంత్రం వేళలో హైదరాబాద్‌కు వెళ్లి వచ్చే విద్యార్థులకు మెట్రో సర్వీసు వేయడంతో బస్ పాస్ ఉన్నా అదనంగా కాంబినేషన్ టికెట్ తీసుకోవాల్సి వస్తుంది. ఆ సమయాల్లో పల్లె వెలుగు బస్సులు నడపాలి. ముచ్చర్ల వైపు బస్సులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– సాయికిరణ్, ఏబీవీపీ నగర కార్యదర్శి

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో రోడ్డు నిర్మాణ పనులను గురువారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పరిశీలించారు. 7వ డివిజన్‌లోని ఆదిత్యనగర్ కాలనీలో రోడ్ల నిర్మాణానికి ఇటీవలే కౌన్సిల్ తీర్మానంలో జనరల్ ఫండ్ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. సీసీరోడ్లు నాణ్యతగా వేసేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లక్ష్మారెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు రవీందర్, లింగారెడ్డి, విఘ్నేష్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న చెన్నకేశవరెడ్డి

పీఆర్టీయూ నేత చెన్నకేశవరెడ్డి

హుడాకాంప్లెక్స్: ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి డిమాండ్ చేశారు. సరూర్‌నగర్ మండలంలో సభ్యత్వ నమోదు వారోత్సవాలను పురస్కరించుకుని జెడ్పీహెచ్ఎస్ చంపాపేట, రాజీవ్‌గాంధీనగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట, సరూర్‌నగర్ పాఠశాలల్లో చేపట్టిన సభ్యత్వ నమోదు 2023 కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్, గౌరవ అధ్యక్షుడు కొండాయపల్లి నారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డిలతో పాటు ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ.. పీఆర్సీ కమిషన్ వెంటనే వేయాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్లు ఆపి రేగ్యులరైజేషన్ చేసి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి, అధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, శరత్‌చంద్ర, రమేష్‌గౌడ్, వేణుగోపాల్, దీన్‌దయాళ్‌రెడ్డి, జహంగీర్‌పాషా, వినయ్ పాల్గొన్నారు.

మంత్రి సబితకు శుభాకాంక్షలు

పహాడీషరీఫ్: మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి సబితా రెడ్డిని ప్రకటించడంపై జల్‌పల్లి మున్సిపాలిటీ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మున్సిపాలిటీ కో–ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల జనార్దన్‌లు కార్యకర్తలతో కలిసి గురువారం మంత్రిని కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్య ఉంటూ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్న సబితారెడ్డికి అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. సబితమ్మను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కష్టపడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో 16వ వార్డు అధ్యక్షుడు పి.నగేష్ ముదిరాజ్, నాయకులు సయీద్ పటేల్, సత్తిరెడ్డి, గోపాల్‌రెడ్డి, జంగయ్య, మతిన్, అబ్బాస్, ఇద్రీస్ పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలు

మంత్రిని కలిసిన నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మంత్రి సబితారెడ్డిని గురువారం కలిశారు. మహేశ్వరం అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించడంపై మంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనరసింహస్వామి స్వామి ఆలయ చైర్మన్ జీ.శివశంకర్, నాయకులు లింగం సురేష్, లింగం ఆంజనేయులు, హరిరాజు, యాదయ్య, రవి, మేకల యాదగిరి, భాస్కర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

పహాడీషరీఫ్: బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని సబితాఇంద్రారెడ్డి కాలనీకి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, యూత్ వింగ్ మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల అర్జున్ ఆధ్వర్యంలో గురువారం మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రంచారి, నాయకులు సిద్ధు, గంగ్యానాయక్, బాబురావు, బాబునాయక్, రత్నం పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: మంత్రి సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



తుక్కుగూడ: మంత్రికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

నేడు యాదవ యుద్ధభేరి సభ

ఇబ్రహీంపట్నం: నాగోల్ శుభం ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరగనున్న యాదవ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బర్ల జగదీశ్వర్‌యాదవ్, యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు వి వెంకటేశ్‌యాదవ్‌లు వేర్వేరు ప్రకటనల్లో గురువారం పిలుపునిచ్చారు. గొర్రెలతో పాటు రాజ్యాధికారంలో సముచిత స్థానం యాదవులకు కల్పించాలన్నారు. రాష్ట్ర జనాభా దామాషా ప్రకారం 18 శాతం యాదవులు ఉన్నారని తెలిపారు. రాజకీయ, విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో తమకు రావాల్సిన వాటాను సాధించుకునేందుకు సమరభేరి మోగించాలని పేర్కొన్నారు.

‘బస్ ట్రాకింగ్ గమ్యం యాప్’ పై అవగాహన

ఇబ్రహీంపట్నం: టీఎస్ ఆర్టీసీ బస్ ట్రాకింగ్ గమ్యం యాప్ పై ఇబ్రహీంపట్నం బస్టాండ్ ఆవరణలో గురువారం ప్రయాణీకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గమ్యం యాప్ పోస్టర్లను ప్రదర్శించారు. స్థానిక ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి మాట్లాడుతూ.. గమ్యం యాప్ ద్వారా ఏ బస్సులు ఎప్పుడు వస్తాయో కచ్చితమైన సమయం తెలుస్తుందన్నారు. ఎక్కడి నుంచి ఎక్కడికి బస్సులు వెళ్తున్నాయో యాప్‌లో చూసుకోవచ్చునన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆకుతోటపల్లిలో గురువారం మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మల్లేష్, కోకన్వీనర్ విజయ్ చందర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా కృష్ణ, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కార్యదర్శిగా నర్సింహ, కోశాధికారిగా రాజు, ప్రచార కార్యదర్శిగా శేఖర్, సభ్యుడిగా సాయిబాబా, కుమార్, సాయిలను ఎన్నుకున్నారు.

గౌడ సంఘం పూర్తిస్థాయి కమిటీ ఎన్నిక



నూతన కమిటీకి నియామక పత్రం అందిస్తున్న నాయకులు

కందుకూరు: మండలం గౌడ సంఘం పూర్తిస్థాయి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు మాజీ ఎంపీపీలు పల్స మహేశ్‌గౌడ్, అనేగొని అశోక్‌గౌడ్, మాజీ సర్పంచ్ కొత్త నర్సింహగౌడ్, మాజీ ఎంపీటీసీ వట్నాల ఈశ్వర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణగౌడ్, ఆ సంఘం సీనియర్ నాయకులు ఆంజనేయులుగౌడ్, మక్తాల వెంకటయ్యగౌడ్, మాదారం రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘం నాయకులు సమావేశమై కమిటీని ప్రకటించారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడిగా అనేగొని పాండుగౌడ్, ఉపాధ్యక్షుడిగా తోకల రాజుగౌడ్, సుధాకర్‌గౌడ్, పాండుగౌడ్, శేఖర్‌గౌడ్, అంజయ్యగౌడ్, అనేగొని కృష్ణగౌడ్, బాలకృష్ణ, దశరథగౌడ్, యాదగిరిగౌడ్, సురేష్‌గౌడ్, దశరథగౌడ్, ప్రధానకార్యదర్శులుగా బూర దిలీప్‌గౌడ్, యుగంధర్‌గౌడ్, కోశాధికారులుగా ఇంద్రకంటి రవీందర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, కార్యదర్శులుగా యాదగిరిగౌడ్, సురేష్‌గౌడ్, శంకర్‌గౌడ్, సభ్యులుగా శ్రీరాములుగౌడ్, బాలరాజుగౌడ్, రాజుగౌడ్, యాదయ్య, సలహాదారులుగా నర్సింహాగౌడ్, పాండు, రమేష్‌గౌడ్, కృష్ణగౌడ్‌లను ఎన్నుకున్నామన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ క్రీడల కార్యదర్శిగా భీముడు

కడ్తాల్: స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ)8వ జోనల్ క్రీడల కార్యదర్శిగా ముదీవ్తాన్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భీముడు నియమితులయ్యారు. గురువారం ఎస్‌జీఎఫ్ఐ క్రీడల సమావేశం హెచ్ఎం శ్రీనివాసచారి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్ మండలాలకు చెందిన పీడీలు, పీఈటీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా భీముడు మాట్లాడుతూ.. మన జోన్ జిల్లా క్రీడాకారులకు మరింత శిక్షణ ఇచ్చి, పతకాలు సాధించేలా ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ నెల 31లోపు మండలాల జట్లను తయారు చేసుకోవాలని, వచ్చే నెల 10లోపు జోనల్‌స్థాయి పోటీలకు జిల్లా ఎంపికలు పూర్తి చేసుకుని జట్లను తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం గతంలో జోనల్ కార్యదర్శిగా వ్యవహరించిన చంద్రమోహన్‌ను ఘనంగా సన్మానించి, అభినందించారు. నూతన జోనల్ కార్యదర్శిగా నియమితులైన భీముడుని వ్యాయామ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా మండలాల పీడీలు రఘుమారెడ్డి, ప్రసాద్, పీఈటీలు రామకృష్ణారెడ్డి, సుశీల, రాజు, రాధ, నర్సింహారావు, ఆనంద్‌బాబు, పాండు, దశరథం, పరమేశ్, కృష్ణకాంత్, మమత, వెంకటేశ్వరీ, మంజుల, రమేశ్ తదితరులు ఉన్నారు.

కవయిత్రి మొల్ల విగ్రహానికి భూమి పూజ

తలకొండపల్లి: మండల కేంద్రంలో శాలివాహన కుమ్మరి సంఘం నాయకుల ఆధ్వర్యంలో గురువారం కవయిత్రి మొల్ల విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్త్రీలు, తక్కువ కులాలపై వివక్ష, వర్ణ దురహంకారాన్ని ఆనాడు మొల్ల ఎదుర్కొందన్నారు. కుండలు చేయడం ఎంత కష్టమో, కవిత్వం చెప్పడం అంతే కష్టమని మొల్ల పేర్కొన్నట్లు వారు వివరించారు. చిన్న పిల్లలకు కూడా సులభంగా అర్థమయ్యే రీతిలో మొల్ల, రామాయణం రచించిందన్నారు. ఇంతా ప్రతిభ గల మొల్ల విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మండలాధ్య క్షుడు నగేష్, ప్రధాన కార్యదర్శి దుర్గాపురం బాలకృష్ణ, సీనియర్ నాయకులు తిరుపతి, బాలకృష్ణ, రమే ష్, మధు, శేఖర్, మల్లేష్,మధు, లక్ష్మణ్, హన్‌మాన్, కుమార్, రాజు, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో శ్రావణ సందడి

- నేడు మొదటి శ్రావణ శుక్రవారం .. పూజలకు సిద్ధమవుతున్న మహిళలు
- ఆలయాల ముస్తాబు
- పూజా సామగ్రి కొనుగోలులో మహిళలు బిజీబిజీ

దిల్‌సుఖ్‌నగర్: లక్ష్మీదేవికి ఎంతో ప్రీతిపాత్రమైన నెల శ్రావణ మాసం... వరలక్ష్మి కటాక్షం కోసం మహిళలు శ్రావణ శుక్రవారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈరోజు శ్రావణ మాసం రెండో శుక్రవారం కావడంతో అష్ట ఐశ్వర్యాలు, శాంతి సౌభాగ్యాలు, సిద్ధించేలా వరాలు ఇవ్వాలని కోరుకుంటూ వరలక్ష్మి వత్రాన్ని ఘనంగా జరుపుకోనున్నారు. ఈనేపథ్యంలో మలక్‌పేటజోన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలను ఆలయ నిర్వాహకులు పూలమాలలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

- జోన్ పరిధిలోని ఆర్‌కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మి అమ్మవారి ఆలయం, శ్రీసరస్వతి ఆలయంతో పాటు దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసంతోషిమాత ఆలయం, శ్రీదుర్గాదేవి దేవాలయం,సైదాబాద్‌లోని శ్రీవిజయదుర్గాదేవి, జయదుర్గాదేవి అమ్మవారి ఆలయం, మలక్‌పేట్‌లోని శ్రీఅండాళ్ నిలయం, మాదన్నపేటలోని దుర్గాదేవి ఆలయం, అక్బర్‌బాగ్, ఐఎస్ సదన్, సరూర్‌నగర్ మండలంలోని గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం శ్రావణమాస వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరుపుకోనున్నారు.



సరూర్‌నగర్ రైతుబజార్‌లో పూలు, పండ్లు కొనుగోలు చేస్తున్న జనం

పెరిగిన పూలు, పండ్ల ధరలు

శ్రావణ శుక్రవారం నేపథ్యంలో వరలక్ష్మీ వ్రతం పూజసామగ్రి, పూలు, పండ్ల ధరలను వ్యాపారులు అమాంతంగా పెంచేశారు. బంతి కిలో రూ.100 నుంచి 130, చామంతి కిలో రూ.300 నుంచి రూ.350 వరకు, గులాబీ రూ. 250 నుంచి రూ.300కు పెంచేశారు. పెరిగిన ధరలతో వినియోగదారులు కొంత అసంతృప్తిని వ్యక్తం చేశారు. పర్వదినాలలో ధరలు పెరగకుండా నియంత్రించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

ఎండుతున్న పంటలు

- అధికంగా దెబ్బతిన్న మొక్కజొన్న పంట
- ఆందోళనలో రైతన్నలు
- పశువులకు మేతగా వదిలేస్తున్న వైనం



నేదునూరులో మొక్కజొన్న పంటను పశువులకు మేతగా వదిలేసిన రైతులు

కందుకూరు: వరుణుడు ముఖం చాటేయడంతో కళ్లెదుటే పంటలు ఎండిపోతున్నాయని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆకాశం మేఘావృతమై ఆశ గొల్పుతున్నా వర్షం మాత్రం కురవడం లేదు. దీంతో రైతన్నలు ఆరుగాలం కష్టపడుతున్నా వాతావరణం అనుకూలించక నానా అవస్థలు పడుతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో అతివర్షాలతో నష్టపోతుండగా, ఇప్పుడు సాగు చేసిన పంటలకు వర్షాలు లేక దెబ్బతింటున్నాయి. దీంతో ఎండుతున్న పంటలను పశువులకు మేతగా వదిలేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది కందుకూరు మండలంలోని ప్రస్తుత పరిస్థితి.


సాగు ఇలా...

మండలంలోని వర్షాకాలం సీజన్‌లో రైతులు వరి 4897 ఎకరాలు సాధారణంగా సాగు ఉండగా 6 వేల ఎకరాల విస్తీర్ణం పైగా సాగు చేశారు. మొక్కజొన్న 6854 సాధారణ విస్తీర్ణం, కాగా ఇప్పటి వరకు 3200 ఎకరాల వరకు సాగు చేశారు. జొన్న 1474కు గాను 200 ఎకరాలు, పత్తి 3298 ఎకరాల సాధారణ విస్తీర్ణం ఉండగా, 1250 ఎకరాలు సాగైయింది. కంది 445 ఎకరాలు, కూరగాయలు 350 ఎకరాలు, ఇతర పంటలు 430 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. ఎంతో ఆశతో సాగు చేసిన రైతులకు వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోయి నష్టపోతున్నారు.

తక్కువ వర్షపాతం..

జూన్ నెలలో సాధారణ వర్షపాతం 86 మి.మీకు గాను 41.4 మి.మీ మాత్రమే నమోదైయింది. 51.86 శాతం తక్కువ కురిసింది. జూలై నెలలో సాధారణ వర్షపాతం 220.9 మీ.మీలకు గాను 140.5 మీ. మీ వర్షం మాత్రమే నమోదైయింది. 57.22 శాతం తక్కువ వర్షం కురిసింది. ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం 89.5 మీ.మీ ఉండగా, ఇప్పటి వరకు కేవలం 21.7 మీ.మీ వర్షం మాత్రమే నమోదైయింది. దీంతో పంటలు తమ కళ్లెదుటే ఎండిపోతున్నాయి. ముఖ్యంగా మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో రైతులు చాలా గ్రామాల్లో మొక్కజొన్నను పశువుల మేతకు వదిలేస్తున్నారు. ఇప్పటికైనా వర్షాలు కురిస్తే పత్తి వంటి పంటలు గట్టెక్కుతాయని రైతన్నలు ఆశగా నిరీక్షిస్తున్నారు.


“పశువులకు మేతగా..



నేను ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. పంట వేసి రెండు నెలలు గడిచింది. మొత్తం రూ.80 వేల వరకు ఖర్చు చేశాను. వర్షాలు లేక పంట అంతా ఎండిపోయింది. చేసేదేమిలేక పశువులను మేపుతున్నాను.

– మల్ల రాములు, రైతు, నేదునూరు

మూడు ఎకరాల పంట ఎండిపోయింది



నేను వర్షాకాలం సీజన్‌లో మూడు ఎకరాల్లో మొక్కజొన్న, ఎకరన్నరలో వరి పంటలు సాగు చేశాను. వర్షాలు లేక మొక్కజొన్న మూడు ఎకరాల్లో పంట ఎండిపోయింది. పెట్టిన పెట్టుబడి నష్టపోయాం. పశువులకు మేతగా వదిలేశాను.

– కన్నయ్యగారి పర్వతాలు, రైతు